7

సాక్షి నిజామాబాద్

మంగళవారం । 26 । మార్చి । 2024

న్యూస్‌రీల్

సాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు సోమవారం ఏడో విడత నీటిని విడుదల చేశారు. ఆయకట్టు అవసరాల కోసం ఏడో విడత నీటి విడుదల చేపట్టామని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు డీసీసీబీ చైర్మన్ ఎన్నిక

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవికి మంగళవారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా సహకార సంఘాల రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు 20 మంది డైరెక్టర్లకు నోటీసులు అందించారు. ఈ నెల 21న చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. అదే రోజు వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. చైర్మన్ ఎన్నికకు అదేరోజు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలోని సమావేశం హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహిస్తారు. అనంతరం చైర్మన్ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ, స్క్రూటినీ, ఆ తర్వాత చేతులెత్తి ఎన్నికను నిర్వహించనున్నారు. 11 మంది డైరెక్టర్ల మద్దతు ఎవరికి ఉంటే వారిని చైర్మన్‌గా ప్రకటిస్తారు.

రమేశ్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే!

డీసీసీబీ చైర్మన్‌గా వేల్పూర్ సొసైటీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఎన్నిక లాంఛనమేనని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అవిశ్వాస తీర్మానం నెగ్గడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. డైరెక్టర్ల క్యాంపు నిర్వహణ సైతం అంతా తానై వ్యవహరించారు. చైర్మన్ ఎన్నిక సందర్భంగా కూడా రమేశ్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేసే అవకాశముంది.





మాధవనగర్ వద్ద కొనసాగుతున్న ఆర్‌వోబీ పనులు

ఆర్వోబీ నిర్మాణంలో భారీ పనులు

- వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవనగర్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణంలో భారీ పనులు సాగుతున్నాయి. వంతెన పిల్లర్లపై సిమెంట్ బిల్లలను క్రేన్ సహాయంతో ఎక్కిస్తున్నారు. భారీ పనులు నడుస్తున్నందున ఈ రోడ్డు మీదుగా వెళ్తున్న వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

టు వీలర్స్, ఫోర్ వీలర్స్, ఆటో రిక్షాలు, స్కూల్ బస్‌లు, డీసీఎంలు ఈ దారిగుండా వెళ్తున్నాయి. రైల్వే గేటు వేసినప్పుడు వాహనాల రద్దీ పెరుగుతుంది. ఈ సందర్భంగా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు. భారీ వాహనాలకు అనుమతి లేదు. బైపాస్ మీదుగా వెళ్లాలి. రూ. 93 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులు పూర్తి కావడానికి ఇంకా సంవత్సరంపైగా పడుతుందని అధికారులు చెబుతున్నారు.



హోలీ.. ఆనంద కేళీ







1) నగరంలో హోలీ సంబురాల్లో డ్యాన్స్ చేస్తున్న మార్వాడీ మహిళలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆనందోత్సాహాల మధ్య హోలీ సంబురాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. నగరంలో మార్వాడీ సమాజం ఆధ్వర్యంలో గంజ్ రైల్వేగేట్ వద్ద హోలీ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. – నిజామాబాద్ సిటీ




నగరంలో హోలీ సంబురాల్లో నృత్యం చేస్తున్న యువకులు



కాకతీయ కాలేజీలో విద్యార్థుల సందడి

బీసీకా.. ఓసీకా!

- నిజామాబాద్ ఎంపీ టికెట్టుపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికే అంటూ ప్రచారం
- బీసీ కోటాలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు పరిశీలన
- మరోవైపు టికెట్టు ఆశిస్తున్న ముత్యాల సునీల్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఎంపీ టికెట్టును కాంగ్రెస్‌లో ఎవరికి కేటాయిస్తారని శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. నిజామాబాద్ అభ్యర్థి విషయంలో సామాజిక సమీకరణాలు ముడిపడి ఉండడంతో పెండింగ్ పడుతూ వస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఖరారు చేసిన 9 స్థానాల్లో నాలుగు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారు. మరో నాలుగు స్థానాల్లో సైతం టికెట్ల కోసం రెడ్డి అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో ఐదు రిజర్వుడు సీట్లు ఉన్నాయి. హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన మొత్తం 16 సీట్లలో సగం సీట్లు రెడ్లకే కేటాయిస్తే బీసీల పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు రెండు సీట్లు మాత్రమే బీసీలకు కేటాయించారు. దీంతో కరీంనగర్ లేదా నిజామాబాద్‌లో ఒక సీటును బీసీలకు కేటాయించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికే టికెట్టు అంటూ వినిపిస్తున్న ప్రచారానికి బీసీ కోటా అంశం అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో బలమైన బీసీ అభ్యర్థిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పేరు తెరమీదకు వచ్చింది. అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయన పేరును సర్వే బృందాలు సైతం సూచించాయి. అయితే ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేశ్‌గౌడ్ ఇప్పటికే జీవన్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి బీసీలు

నిజామాబాద్ లోక్‌సభ నుంచి బీజేపీ సిట్టింగ్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఇద్దరూ బీసీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందినవారు. కాగా కాంగ్రెస్ టికెట్టు రేసులో మొదటి నుంచి జీవన్‌రెడ్డితో పాటు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి ఉన్నారు. వీరిద్దరూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందారు. అయితే సునీల్‌రెడ్డికి యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉండడంతో పాటు యువ నాయకులతో పాటు సీనియర్లు సైతం ఆయన అభ్యర్థిత్వంపై మొగ్గు చూపుతుండడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే అనిల్ పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ ఇటీవల రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించడంతో ఆయన రేసు నుంచి తప్పుకున్నట్లు అయింది.

బీసీకి కేటాయిస్తే జీవన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్!

నిజామాబాద్ టికెట్టును బీసీలకు కేటాయిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా గెలుపొందిన జీవన్‌రెడ్డి ఐదేళ్లుగా శాసనమండలిలో కాంగ్రెస్ తరఫున ప్రజా సమస్యలపై పోరాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఒక దశలో కాంగ్రెస్ అధిష్టానం జీవన్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా ప్రకటించేందుకు సిద్ధమైంది. తర్వాత జరిగిన పరిణామాల కారణంగా రేవంత్‌రెడ్డిని పీసీసీ చీఫ్‌గా నియామకమయ్యారు. శాసనసభ ఎన్నికల్లో జగిత్యాల నుంచి ఓడిపోయిన జీవన్‌రెడ్డి మంత్రి పదవి చేపట్టే అవకాశం కోల్పోయారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి కేసీఆర్‌పై పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన జీవన్‌రెడ్డికి ఉత్తర తెలంగాణతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉన్న విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించింది. రైతులు, నిరుద్యోగులు, గల్ఫ్ కార్మికుల సమస్యలతో పాటు ఇతర అన్ని అంశాలపై మంచి పట్టున్న జీవన్‌రెడ్డికి భారీగా అభిమానులున్నారు. దీంతో నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంట్ స్థానాల్లో ఏదో ఒక స్థానం నుంచి జీవన్‌రెడ్డిని బరిలోకి దించాలని ఏఐసీసీ భావించింది. చివరకు నిజామాబాద్ నుంచి పోటీ చేయించాలని నిర్ణయించారు. కానీ సామాజిక సమీకరణలు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.

నీటి విడుదలపై వాగ్వాదం




క్రాస్ రెగ్యులేటరీ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి

- కమ్మర్‌పల్లి శివారులోని వరద కాల్వ క్రాస్ రెగ్యులేటరీ వద్ద ఉద్రిక్తత
- రైతులను సముదాయించిన ఎస్‌ఈ శ్రీనివాస్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్ర శివారులోని వరద కాలువ క్రాస్ రెగ్యులేటరీ వద్ద నీటి విడుదలను స్థానిక గ్రామాల రైతులు అడ్డుకున్నారు. దిగువకు నీటిని విడుదల చేస్తే తమ పరిస్థితి ఏమిటని వాగ్వాదానికి దిగారు. అధికారులు నచ్చజెప్పడంతో చివరకు రెండు అడుగుల మేర నీటి విడుదలకు ఒప్పుకున్నారు. సోమవారం ఉదయం నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈ గణేశ్, ఏఈ రామారావు వరద కాలువ 27.850 కిలో మీటరు పాయింట్ క్రాస్ రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నారు. కాలువలోని నీటిని దిగువకు వదలడం కోసం గేట్లు ఎత్తడానికి సన్నాహాలు చేస్తుండగా, తిమ్మాపూర్, నాగాపూర్, కమ్మర్‌పల్లి తదితర గ్రామాల రైతులు అక్కడికి చేరుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాలువలోని నీటిని దిగువకు వదిలితే తమ పంటల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎండలు ముదురుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోయడం లేదని వాపోయారు. వరి పంట పొట్ట దశకు చేరుకుందని, ఈ దశలో తడులు లేకపోతే దిగుబడి మీద ప్రభావం చూపుతుందన్నారు. గేట్లు ఎత్తేదే లేదని పట్టుబట్టారు. దీంతో డీఈ గణేశ్ ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి క్రాస్ రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడారు. అయితే వారం రోజుల కిందటే నీటి విడుదలకు ఒప్పుకున్నామని, మళ్లీ కావాలంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రాస్ రెగ్యులేటరీ నిర్మాణ లక్ష్యం మేరకు తమ కోటా నీరు తమకే చెందాలని అన్నారు. ఎస్‌ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ దిగువన నీటి మట్టం తక్కువగా ఉండడంతో అక్కడి పంటల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని రైతులు వాపోతున్నారని వివరించారు. కాలువలో క్రాస్ రెగ్యులేటరీ వద్ద నీటి మట్టం నాలుగు మీటర్లు ఉందని, ఇందులో నుంచి ఒక మీటర్ మట్టం విడుదల చేస్తే అక్కడి రైతుల సమస్య కొంతమేర తీరే అవకాశం ఉందని, సాటి రైతుల కష్టంపై రైతులు సహకరించాలని ఎస్‌ఈ కోరారు. కాలువ వెంబడి క్రాస్ రెగ్యులేటరీలు నిర్మించినప్పుడు ఎవరి వాటాలు వారికి ఉన్నాయని, తమ వాటాలో నుంచి నీటిని తీసుకెళ్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు నిలదీశారు. ఇలా అయితే క్రాస్ రెగ్యులేటరీ నిర్మాణం ఎందుకు చేపట్టారో అధికారులు తెలపాలని అన్నారు. రైతులు, అధికారుల మధ్య మాటల యుద్ధం సాగింది. చివరకు రెండు అడుగుల మేర గేట్లు ఎత్తడానికి రైతులు అంగీకరించారు. దీంతో అధికారులు ఊపిరి తీసుకున్నారు. అనంతరం అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

భానుడి భగభగ

- మోర్తాడ్‌లో అత్యధికంగా 41.0 డిగ్రీలు నమోదు
- మరో మూడ్రోజులు ఎండలు
- పగలు బయటికి రావొద్దని వాతావరణశాఖ అధికారుల సూచన



సుభాష్‌నగర్: జిల్లాలో భానుడు మండిపోతున్నాడు. ఏప్రిల్ రాక ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించి నమోదవుతుండంటే.. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సోమవారం మోర్తాడ్‌లో 41.0 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. రాష్ట్రవ్యాప్తంగా మరో మూడ్రోజుల పాటు పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలో అత్యవసర పని ఉంటే తప్ప బయటికి రావొద్దని సూచిస్తున్నారు. రాత్రి సమయంలోనూ ఉక్కపోతతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఇప్పటికే కూలర్లు, ఏసీల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. సోమవారం సగటు ఉష్ణోగ్రతలు 39.0/25.7 డిగ్రీలుగా నమోదైంది.

సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	కనిష్టం	గరిష్టం	మండలం	కనిష్టం	గరిష్టం	మండలం	కనిష్టం	గరిష్టం
మోర్తాడ్	24.5	41.0	సాలూర	24.2	39.4	చందూరు	24.7	38.5
డిచ్‌పల్లి	22.0	40.7	ఎడపల్లి	24.6	39.3	మాక్లూర్	24.0	38.3
మోపాల్	24.2	40.2	కమ్మర్‌పల్లి	24.4	39.2	సిరికొండ	25.8	38.1
ముప్కాల్	24.0	40.0	జక్రాన్‌పల్లి	24.0	39.2	కోటగిరి	24.2	38.0
బోధన్	24.3	39.9	మెండోరా	24.4	39.1	పోతంగల్	23.8	37.4
భీమ్‌గల్	25.8	39.9	నిజామాబాద్ నార్త్	23.3	39.0	ధర్పల్లి	23.7	37.3
నిజామాబాద్ సౌత్	25.1	39.6	ఆర్మూర్	24.5	39.0	నిజామాబాద్ రూరల్	23.7	37.3
వర్ని	24.1	39.4	వేల్పూరు	24.8	38.8	నవీపేట	23.6	37.3
			ఏర్గట్ల	25.1	38.7			

జల జగడాలేనా!



నీరు లేక వెలవెలబోతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో తగ్గిన నీటిమట్టం
- కాకతీయ కాలువ జోన్–1కు ముగిసిన నీటి విడుదల
- ఇంకా చేతికందని పంటలు
- నీటి కోసం రైతుల మధ్య గొడవలు జరిగే అవకాశం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో ఈ సీజన్‌లో రైతుల మధ్య నీటి కోసం గొడవలు తప్పేలా కనిపించడం లేదు. ప్రాజెక్ట్‌లో నీరు లేకపోవడం, పంటలు ఇంకా చేతికి అందకపోవడంతో రైతుల మధ్య వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. సోమవారం వరద కాలువలో నిల్వ ఉంచిన నీటిని దిగువకు తరలించడానికి కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ వద్ద క్రాస్ రెగ్యులేటరీ గేట్లను ఎత్తడానికి అధికారులు యత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉన్న నీరు దిగువకు వెళ్తే తమ పరిస్థితి ఏంటాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నీరు బోటాబోటిగా ఉండటంతో ఇలా నీటి కోసం వివాదాలు జరిగే అవకాశం ఉంది. వరద కాలువలో నీటి నిల్వ అవసరం గురించి తెలిసి కూడా అధికారులు గుట్టు చప్పుడు కాకుండా వరద కాలువ ద్వారా నీటిని తరలించారు. ఆ నీటిని కాకతీయ కాలువకు మళ్లిస్తున్నామంటూ చెప్పారు. ప్రస్తుతం నీటిమట్టం తగ్గడంతో వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టే అవకాశం లేదు. కాలువలో నీరు లేకపోవడంతో పంటలను కాపాడుకోడానికి రైతులు తంటాలు పడుతున్నారు. ఉన్న నీరు దిగువకు పోతే తమకు మళ్లీ విడుదల చేసే అవకాశం లేకపోవడంతో ఉప్లూర్ రైతులు అడ్డుకున్నారు.

నీటిని మళ్లించుకుంటున్న రైతులు

కాకతీయ కాలువ ద్వారా ప్రస్తుత సీజన్‌లో రెండు జోన్లుగా విభజించి వారబందీ ప్రకారం నీటి విడుదల చేపడుతున్నారు. జోన్–1లో కాకతీయ కాలువ డీ–53 వరకు, జోన్–2 లో డీ–54 నుంచి ఎల్‌ఎండీ వరకు ఉన్నాయి. జోన్–1కు నీటి విడుదల ఆదివారంతో ముగిసింది. ప్రస్తుతం జోన్–2కు చివరి తడి అందిస్తున్నారు. దీంతో జోన్–1 పరిధిలోని ఉప కాలువల తూంలను మూసి వేయాలి. కానీ జోన్–1లో ఇంకా పంటలు పచ్చదనంతో ఉన్నాయి. అవి చేతికి రావడానికి మరో 15 రోజులు పడుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటి మట్టం ప్రకారం మళ్లీ సరఫరా చేపట్టకపోవచ్చని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి జోన్–1 రైతులు జోన్–2కు వెళ్తున్న నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో జోన్–2 పరిధిలోని రైతుల పంటలకు చివరి వరకు నీరు అందే పరిస్థితి లేదు. ఇలా రైతుల మధ్య వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ ఎత్తిపోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా ఇప్పటికీ లిఫ్ట్ ట్రయల్ రన్ చేపట్టలేదు. పూర్తిగా ఎత్తిపోయిన తర్వాత లిఫ్ట్ మొరాయిస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మిగిలింది 5.5 టీఎంసీలే..

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 17.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అందులో తాగు నీరు, డెడ్‌స్టోరేజీ, ఆవిరి అన్ని కలుపుకుని 12 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతామని ప్రాజెక్ట్ అధికారులు తేల్చి చెప్పారు. అవి పోగా మిగిలేది 5.5 టీఎంసీలు మాత్రమే. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా నిత్యం 7500 క్యూసెక్కులు జోన్–2కు వదులుతున్నారు. అన్ని కాలువలు, లిఫ్టులు కలుపుకుని రోజు 0.8 టీఎంసీల నీరుఖాళీ అవుతోంది. వారం రోజులు నీటి విడుదల కొనసాగితే 5.6 టీఎంసీల నీరు అయిపోతుంది. ఏప్రిల్ మధ్య వరకు పంటలు చేతికి వచ్చే అవకాశం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

ఓపెన్‌ అథ్లెటిక్స్‌ మేనేజర్‌గా సంజీవయ్య



వేల్పూర్‌: మండలంలోని జాన్కంపేట్‌కు చెందిన తలారి సంజీవయ్య బెంగళూరులో సోమవారం ప్రారంభమైన ఓపెన్‌ అథ్లెటిక్స్‌ పోటీలకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ బ్యాండ్మింటన్‌ క్రీడాకారుడైన సంజీవయ్య సికింద్రాబాద్‌ రైల్‌ నిలయంలో సీనియర్‌ సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బెంగళూరులో సోమ, మంగళ వారాల్లో నిర్వహిస్తున్న 6వ ఇండియా ఓపెన్‌ అథ్లెటిక్స్‌ పోటీలకు భారత జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ పోటీల్లో దేశానికి చెందినవారితోపాటు విదేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు.

మేడిచర్లకు సన్మానం



నిజామాబాద్‌ సిటీ: కవి, రచయిత మేడిచర్ల ప్రభాకరరావుకు ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తీ పురస్కారంతో సత్కరించింది. ఈసందర్భంగా సోమవారం నగరంలోని గీతా భవనంలో మేడిచర్లను అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి ఆధ్వర్యంలో సన్మానించారు. గీత భవనం ప్రతినిధులు ఆరెట్టి లక్ష్మీనారాయణ, సభ్యులు గంగాధర్‌, చంద్రశేఖర శర్మ, జీఎం శంకర్‌, రుక్మన్‌రావు, తులసీదాస్‌ ఆర్య, మధుసూధన్‌ రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్‌: బోర్లంరోడ్డులోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల రెసిడెన్షియల్‌ విద్యాలయంలో ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపల్‌ ధనలక్ష్మి సూచించారు. ఐదో తరగతిలో 80 సీట్లకుగానూ 60 సీట్లు మైనారిటీలకు, 20 సీట్లు నాన్‌ మైనారిటీలకు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌ ఫస్టియర్‌ ఎంపీసీ, బైపీసీలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో 30 సీట్లు మైనారిటీలకు, 10 సీట్లు నాన్‌ మైనారిటీలకు రిజర్వ్‌ చేశారని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 73311 70814, 83338 60782 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిర్నితండాలో తాగునీటి కష్టాలు



నిజాంసాగర్‌(జుక్కల్‌): గిర్నితండాలో ప్రజలు తాగు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి మిషన్‌ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడం, బోరు మోటారు చెడిపోవడంతో తండా ప్రజలకు ట్యాంకర్‌ నీరే దిక్కయ్యింది. గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ ద్వారా నీటిని సరఫరా చేస్తేనే గిరిజనులకు తాగు నీరు అందుతోంది. తండాలో ఉన్న బోరు మోటారు చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మోటారు కు మరమ్మతులు చేయించి, తాగు నీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

హాస్టల్‌ రోడ్డును బీటీగా మార్చాలి

తాడ్వాయి: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల వరకు ఉన్న దారిని బీటీ రోడ్డుగా మార్చాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం వేసిన రోడ్డు గుంతలమయంగా తయారైందని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





ఆనంద హోలీ

హోలీ సంబురం అంబరాన్నంటింది. ఊరువాడా రంగులమయమైంది. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు రంగుపూస్తున్న పల్లె గంగారెడ్డి



నగరంలోని గోశాలలో..



హోలీ సంబురాల్లో జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల, తదితరులు



కాకతీయ విద్యార్థుల ఉత్సాహం..



కేరింతలు కొడుతున్న కాకతీయ కళాశాల విద్యార్థినులు



నగరంలోని శ్రీసాయిలక్ష్మీనగర్‌లో..

ఆర్టీసీ బస్సు వచ్చేనా..?

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న కోమట్‌పల్లి గ్రామస్తులు
- విన్నవించినా బస్సు నడపని ఆర్టీసీ అధికారులు
- సరైన రవాణా సౌకర్యం కరువు



డొంకేశ్వర్‌ మండలంలోని కోమట్‌పల్లి గ్రామం



ప్రమాదకరంగా ఉన్న వంతెన

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లాలో ఇప్పటికీ ఆర్టీసీ బస్సు వెళ్లని ఊరు ఉందంటే అది డొంకేశ్వర్‌ మండలం కోమట్‌పల్లి గ్రామమే. ఇటు డొంకేశ్వర్‌, అటు నందిపేట్‌ మండల కేంద్రాలకు దగ్గరగా ఉన్నప్పటికీ.. గ్రామానికి ఇంత వరకు ఆర్టీసీ బస్సు రాకపోవడం విడ్డూరమనే చెప్పాలి. ఊరి దాకా రోడ్డు మార్గం ఉన్నా కూడా ఆర్టీసీ బస్సెక్కి ప్రయాణాలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. 2005లో తమ గ్రామానికి బస్సు రావడాన్ని చూశామని, ఆ తర్వాత పత్తాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి నుంచి వేరే గ్రామాలు, మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కోమట్‌పల్లికి బస్సు లేకపోవడంతో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకొనే యోగ్యం గ్రామానికి చెందిన మహిళలకు లేకుండాపోయింది. బస్సులో ఉచితంగా ప్రయాణించాల్సిన మహిళలు డబ్బులు ఖర్చుపెట్టి ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నారు.

వంతెన కారణంగా..

కోమట్‌పల్లికి వెళ్లడానికి మూడు రోడ్డు మార్గాలున్నాయి. ఒకటి శాపూర్‌ నుంచి, మరొకటి డొంకేశ్వర్‌–నికాల్‌పూర్‌ నుంచి, ఇంకొకటి బాద్గుణ మీదుగా వెళ్లవచ్చు. గత పదిహేనేళ్ల క్రితం కోమట్‌పల్లికి ఆర్టీసీ బస్సు వచ్చేది. అప్పటికీ సరైన బీటీ రోడ్డు కూడా లేదు. రెండు ట్రిప్పులు తిరిగిన బస్సు కోమట్‌పల్లిలోనే రాత్రికి హాల్ట్‌ అయ్యేది. ఊరు మారుమూల ప్రాంతంలో ఉండడంతో ఆర్టీసీ బస్సు కోమట్‌పల్లికి రావడం మానేసింది. ఇప్పుడు శాపూర్‌ నుంచి కోమట్‌పల్లి, కోమట్‌పల్లి నుంచి నికాల్‌పూర్‌ వరకు బీటీ రోడ్లు ఉన్నాయి. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు ఇటువైపు బస్సును నడపడం లేదు. ప్రస్తుతం వేసిన రోడ్లు సైతం పాడవుతున్నాయి. వంతెనలు కూడా ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు జరుగుతాయని అధికారులు భయపడుతున్నారు. నికాల్‌పూర్‌ ఊరికి వెళ్లే మార్గంలో చెరువు కట్ట వద్ద బ్రిడ్జి లోతుగా ఉండడంతో బస్సు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అక్కడి వరకు కాకున్నా కోమట్‌పల్లి గ్రామం వరకైనా ఆర్టీసీ బస్సును నడపాలని ఊరి ప్రజలు చాలాసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ బస్సు నడపడం లేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా స్పందించి తమ గ్రామానికి బస్సును నడిపించాలని మహిళలు కోరుతున్నారు.

చాలాసార్లు విన్నవించాం



గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని అధికారులకు చాలా సార్లు విన్నవించాం. అయినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. కొన్నేళ్ల క్రితం ఊరికి బస్సు వచ్చి రాత్రికి కూడా ఇక్కడే ఉండేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సును నడిపించాలి.
– నాగరాజు, మాజీ సర్పంచ్‌, కోమట్‌పల్లి

వేరే ఊర్లకు వెళ్లలేకపోతున్నాం



మా ఊరికి బస్సురాక దాదాపు 15 ఏళ్లు దాటింది. ఆటోలు కూడా సక్కగ అస్తలేవు. దీంతో వేరే ఊర్లకు పోవాలంటే మహిళలకు చాలా ఇబ్బందిగా ఉంది. ఇంటి బైకులు, వేరే వాళ్ల బండ్లు ఎక్కిపోతున్నాం.
– గౌస్యాబేగం, కోమట్‌పల్లి

బండెనక బండి కట్టి

ఇసుకను కొల్లగొట్టి..



ఎడ్ల బండ్లపై ఇసుక రవాణా

- ఎడ్లబండ్లలో దర్జాగా ఇసుక రవాణా
- కప్పలవాగుకు క్యూ కడుతున్న బండ్లు
- పట్టణంలో డంపులు.. పక్క గ్రామాలకు తరలింపు

భీమ్‌గల్‌: వ్యవసాయ పనుల్లో రైతన్నకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన ఎద్దులను ఇసుక అక్రమ వ్యాపారులు వాడుకుంటున్నారు. వాహనాల్లో ఇసుక తరలిస్తే అధికారులు పట్టుకుంటారని.. ఎడ్ల బండ్లలో తరలిస్తే కేసులుండవని అంటున్నారు. దీంతో పట్టణానికి ఆనుకొని ఉన్న కప్పలవాగుకు రాత్రి వేళల్లో ఎడ్ల బండ్లు క్యూ కడుతున్నాయి. బండ్లలో ఇసుకను యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమంగా తరలిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలించే ఎడ్ల బండ్లు తహసీల్‌, పోలీస్‌స్టేషన్‌ సమీపం నుంచే వెళ్తున్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. భీమ్‌గల్‌ పట్టణ కేంద్రంలో సరఫరా చేసేందుకు ఒక్కో బండికి రూ.700 నుంచి రూ. 800 వరకు వసూలు చేస్తుండగా, పొరుగు గ్రామాలకు తరలించాలంటే రూ.900 నుంచి రూ.1100వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది మరో అడుగు ముందుకేసి ఎడ్ల బండ్ల ద్వారా తెచ్చిన ఇసుకను ఓ చోట డంప్‌ చేసి రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా వినియోగదారులకు చేరవేస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

పట్టణంలో వందకుపైగా ఎడ్ల బండ్లు

యాంత్రీకరణ ప్రభావంతో వ్యవసాయ పనుల్లో ఎక్కడ చూసినా ట్రాక్టర్లు కనిపిస్తుండగా, భీమ్‌గల్‌ పట్టణంలో మాత్రం ఎడ్లబండ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో పట్టణంలో పదుల సంఖ్యలో బండ్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య వంద దాటింది. ఎద్దులతోపాటు బండ్లను కేవలం ఇసుక అక్రమ రవాణా కోసమే కొనుగోలు చేస్తున్నారు. ఇసుకను జేసీబీలతో తవ్వినా, ట్రాక్టర్లు, టిప్పర్లు, ఆటో ట్రాలీల్లో రవాణా చేసినా పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు వాటిని సీజ్‌ చేస్తుంటారు. అదే పశువుల ద్వారా నడిచే బండ్లలో తీసుకెళ్తే కేసులు ఉండవనేది అక్రమార్కుల ధీమా.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వాగులోనుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తుండడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవి పూర్తిస్థాయిలో ప్రారంభంకాకముందే పంటలకు, పశువులకు నీటి కొరత ఏర్పడుతోంది. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో కనీసం తాగడానికి నీరు దొరకని ప్రమాదం ఉంటుందని రైతులు, పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.



టార్చిలైట్లు పట్టుకొని విద్యార్థులు..

రాత్రి వేళల్లో కప్పలవాగులోకి వెళ్తున్న ఎద్దుల బండ్ల వెంట విద్యార్థులు టార్చిలైట్లు పట్టుకొని వెళ్తున్నారు. చీకటి కారణంగా ఇసుక తవ్వడం కష్టమవుతుందని భావించి టార్చిలైట్లు పట్టుకొనేందుకు తమ వెంట పిల్లలను తీసుకెళ్తున్నారు. కొందరు పిల్లలతోనే ఎడ్లబండ్లను వాగు దాటిస్తున్నారు.

విద్యుత్‌ సామగ్రి చోరీ ముఠా అరెస్ట్‌

- వ్యవసాయ బోరుబావుల కేబుళ్లు, ఇతర సామగ్రి చోరీ
- ఆర్మూర్‌ పట్టణంలో విక్రయం
- ముగ్గురు యువకులతోపాటు పాత ఇనుప సామాను వ్యాపారి అరెస్ట్‌



కేబుళ్లు ఇతర సామగ్రిని తరలిస్తున్న రైతు



పట్టుబడిన విద్యుత్‌ సామగ్రి

ఆర్మూర్‌టౌన్‌: వ్యవసాయ బోరుబావుల కేబుళ్లు, స్టార్టర్లతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగను దొంగిలిస్తున్న ముగ్గురు యువకుల ముఠాను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని జై భవానీ ఆర్డర్‌మెస్‌కు చెందిన సబ్‌మెర్సిబుల్‌ పంపు శనివారం రాత్రి చోరీకి గురైంది. యజమాని అనిల్‌ కూపీలాగగా పంపు ఎత్తుకెళ్లిన దొంగలు వసీమ్‌కు విక్రయించనట్లు వెల్లడైంది. వసీమ్‌ వద్దకు వెళ్లిన అనిల్‌ ఆయన తెలిపిన సమాచారంతో దొంగల ముఠాను పట్టుకున్నారు. పట్టణంతోపాటు పిప్రికి చెందిన ముగ్గురు యువకులు వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావుల స్టార్టర్‌ బాక్సులు, సబ్‌మెర్సిబుల్‌ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగతోపాటు విద్యుత్‌ ఉపకరణాలను చోరీ చేస్తూ పట్టణంలోని వీక్లి బజార్‌ సమీపంలో ఉన్న వసీమ్‌(తిల్లీబాబా)కు విక్రయించినట్లు తేలింది. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన రైతులు వసీమ్‌కు చెందిన పాత ఇనుపసామాన్‌ దుకాణంలో పోలీసుల సహాయంతో తనిఖీ చేయగా, రూ.లక్షల విలువ చేసే విద్యుత్‌ ఉపకరణాలు లభ్యమయ్యాయి. చోరీ చేసి తీసుకొచ్చిన విద్యుత్‌ సామగ్రిని కొనుగోలు చేస్తూ దొంగతనాలను ప్రోత్సహించిన వసీమ్‌తోపాటు ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోరుబావుల కేబుల్‌ చోరీ

బోధన్‌రూరల్‌(బోధన్‌) : మండలంలోని కల్దుర్కి గ్రామ శివార్లలోని వ్యవసాయ విద్యుత్‌ బోరుబావుల కేబుళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ సోమవారం తెలిపారు.

క్రైం కార్నర్‌

డివైడర్‌ను బైక్‌ఢీకొని యువకుడి మృతి

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం ప్రాంతానికి చెందిన తన్నీరు వెంకటరాంబాబు(23) కరీంనగర్‌ జిల్లా కేంద్రంలో ఉంటూ సోలార్‌ ప్లేట్లు బిగించే పనిచేస్తున్నాడు. ఆదివారం కామారెడ్డి కోర్టులో సోలార్‌ ప్లేట్లు బిగించారు. ఆదివారం రాత్రి సమయంలో తన స్నేహితులైన చరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లుతో కలిసి బైక్‌పై కరీంనగర్‌ పయనమయ్యాడు. ఈ క్రమంలో బైక్‌ మండల కేంద్రంలో డివైడర్‌ను ఢీకొనగా రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు, చరణ్‌కుమార్‌రెడ్డికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడి

రుద్రూర్‌/బోధన్‌ రూరల్‌: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు.రుద్రూర్‌ మండల కేంద్రంలోని అంబం(ఆర్‌)ఎక్స్‌ రోడ్డు సమీపంలోని హోటల్‌పై దాడి చేసి రూ.2,277 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. హోటల్‌ యజమాని గంగాధర్‌పై కేసు నమోదు చేశామన్నారు. బోధన్‌ మండలం అమ్దాపూర్‌ గ్రామంలోని బెల్ట్‌షాపులపై దాడి చేసిరూ. 9వేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసకున్నామని ఎస్సై నాగనాథ్‌ తెలిపారు.బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులునమోదు చేశామన్నారు.

పేకాటస్థావరంపై దాడి

దోమకొండ: మండలంలోని సంగమేశ్వర్‌ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై సోమవారం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.6,410 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా పేకాటస్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

చెరువులో కుళ్లిన మృతదేహం

ఇందల్వాయి: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో కుళ్లినస్థితిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నల్లరంగు ఫుల్‌ టీషర్ట్‌, గోధుమ రంగు ప్యాంట్‌ ఉన్నాయని ఎస్సై మనోజ్‌ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మిర్చి కాంపౌండ్‌లో..

ఖలీల్‌ వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. చాంద్‌ మిర్చి గిర్ని వద్ద సుమారు 60 ఏళ్ల మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండగా, స్థానికులు జీజీహెచ్‌కు తరలించారన్నారు. పరిస్థితి విషమించి సదరు మహిళ సోమవారం మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌ కాలనీకి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌ కాలనీకి చెందిన మంచిర్యాల స్వరూపారాణికి భర్తతో గొడవ కావడంతో సోమవారం ఉదయం విద్యానగర్‌ కాలనీలో ఉండే తల్లిగారింటికి వెళ్లింది. కొద్దిసేపటికే అక్కడి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. భర్త బ్రహ్మాచారి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కావడంతో అధికారులు ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్‌ ఉన్నందున పట్టణంలోని ఫ్లెయింగ్‌స్కాడ్‌ టీం అధికారి, మున్సిపల్‌ ఇరిగేషన్‌ డీఈ భూమేశ్‌ పలు వాహనాలను తనిఖీ చేశారు. నగదు, బంగారం, ఇతర వస్తువులు తమ వాహనాల్లో తీసుకెళ్తే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. రూ. 50 వేలకు మించి నగదు ఉంటే సీజ్‌ చేస్తామన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

కారులో మంటలు

- ఒకరికి తీవ్రగాయాలు
- స్వల్పగాయాలతో బయటపడ్డ మరో ఇద్దరు



మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

నిజాంసాగర్‌(జుక్కల్‌): సంగారెడ్డి – నాందెడ్‌ జాతీయ రహదారిపై వెళ్తున్న కారు మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద డివైడర్‌ను ఢీకొని రోడ్డు కిందకు దూసుకుపోయింది. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ప్రమాదతీవ్రత కారణంగా మంటలు అంటుకొని కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న శైలజకు తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధాకర్‌ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఫైర్‌ సిబ్బంది కారులో వ్యాపించిన మంటలను ఆర్పివేశారు.